క్లుప్తంగా

నేడు రొద్దం నుంచి పావగడకు పాదయాత్ర

రొద్దం: మండల కేంద్రంలోని పెద్దాంజనేయ స్వామి దేవాలయం నుంచి పావగడ శనేశ్వర దేవాలయం వరకూ శ్రీరామ భక్త మండలి ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర నిర్వహించనున్నట్లు అర్చకుడు గిరీష్‌స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాదయాత్రగా వెళ్లి శనేశ్వరస్వామి దర్శించుకుంటామని వివరించారు. కాలినడక వెళ్లి శనేశ్వరస్వామిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందన్నారు.

గౌరిగానపల్లిలో 'పొలంబడి'

లేపాక్షి: మండలంలోని గౌరిగానపల్లి వద్ద శనివారం మధ్యాహ్నం రైతు సోమప్ప సాగు చేసిన మొక్కజొన్న పంటలో వ్యవసాయాధికారులు వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనశుద్ధి, రక్షక పంట, ఎరువుల యాజమాన్యం, విత్తన మోతాదుపై వ్యవసాయాధికారి శ్రీలత రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ పుష్పలత, వీఎస్ఏ సిద్దేశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


సునీల్

పరిగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సునీల్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కృపసత్యరాజు, పీడీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 25 వరకూ కర్నూలులో జరిగే అండర్-17 వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాడన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సునీల్‌ను ఉపాధ్యాయ బృందంతో పాటూ విద్యార్థి తల్లిదండ్రులు అభినందించారు.

'లేపాక్షి' పుస్తకావిష్కరణ

లేపాక్షి: చారిత్రక పరిశోధకుడు మైనాస్వామి కన్నడ భాషలో రచించిన లేపాక్షి పుస్తకాన్ని శనివారం ఉదయం బెంగళూరు ప్రెస్ క్లబ్‌లో అంతర్జాతీయ యోగా గురుశ్రీనివాస్ ఆర్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయనగర సామ్రాజ్య వైభవాన్ని ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ సిలబస్‌లో చేర్చాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కన్నడ రచయిత బిఆర్.కృష్ణ, మీడియా అకాడమీ చైర్మన్ సదాశివశణయ్, తెలుగు అకాడమీ చైర్మన్ రాధాకృష్ణరాజు, బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సిబ్బంది వసంత కవిత, డాక్టర్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి

పరిగి: మండలంలోని బీచిగానిపల్లి రెవెన్యూ విలేజీలో వీఆర్ఏగా పని చేస్తున్న గంగాధరప్ప (57) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనరసింహం సిబ్బందితో కలిసి శనివారం బీచిగానిపల్లికి వెళ్లి గంగాధరప్ప మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య రామాంజమ్మకు రెవెన్యూ శాఖ తరఫున తక్షణ సాయంగా రూ.15 వేలు ఆర్థిక సాయంగా అందించారు. కార్యక్రమంలో వీఆర్వోలు నరసింహులు, మద్దిలేటి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

24 నుంచి చింత ఫలసాయానికి వేలం

మడకశిర(అగళి): అగళి మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలోని చింత ఫలసాయానికి ఈనెల 24 నుంచి బహిరంగ వేలం వేయనున్నట్లు గ్రామ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. రాగేలింగనపల్లి, హనుమనపల్లి గ్రామాల్లోని చింతఫలసాయాన్ని ఈనెల 24న ఉదయం 11 గంటలకు, ఇరిగేపల్లి, నందరాజనపల్లి గ్రామాల పరిధిలోని చింత ఫలసాయాన్ని ఈనెల 25న ఉదయం 11 గంటలకు, అగళిలోని చింతఫలసాయాన్ని ఈనెల 27న ఉదయం 11 గంటలకు ఆయా గ్రామ సచివాలయాల వద్ద బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు రూ.3 వేల చొప్పున డిపాజిట్ చెల్లించి ఈ వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

కంటైనర్‌ను ఢీకొన్న బస్సు


దెబ్బతిన్న బస్సు

సోమందేపల్లి: మండలంలోని వెలుగు మాకులపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్ వద్ద శనివారం బెంగళూరు వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న ప్రైవేటు బస్సు కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ మహబూబ్ బాషా కాళ్లకు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి

పావగడ: బీజేపీ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని స్థానిక బీజేపీ నాయకుడు లాయర్ కృష్ణానాయక్ తెలిపారు. దేశ వ్యాప్తంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆధ్వర్యంలో విజయ సంకల్ప అభియాన శనివారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా తాలూకాలోని విరుపసముద్రం పంచాయతీ పరిధిలో కృష్ణానాయక్ విజయ సంకల్ప అభియాన కార్యక్రమం నిర్వహించారు. విరుపసముద్రం, గౌడేటి, కనకాపురం, గంగవరం, బసవనహళ్ళి, గుమ్మఘట్ట గ్రామాల్లో పర్యటించి బీజేపీ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కాగా ఇదే రోజు 8 బృందాలు తాలూకాలోని 246 బూత్‌లలో పర్యటించాయి.

జగనన్నతోనే పేదలకు మేలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు బోయ లింగమ్మ. టీడీపీ మద్దతురాలు. ఎం కొత్తపల్లిలో నివసిస్తోంది. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈమె కుటుంబానికి ఇన్‌పుట్ సబ్సిడీ రూ.12,000, వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.82 వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.14,494, వైఎస్సార్ పంటల బీమా కింద రూ.23,334, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.37,500, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.38,500 లబ్ధి చేకూరింది. మాలాంటి పేదలకు సాయం చేస్తున్న జగన్‌కు రుణపడి ఉంటామని బోయ లింగమ్మ తెలిపింది. ముఖ్యమంత్రి జగనన్న మేలు ఎప్పటికీ మరువలేమని చెబుతోంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు రేణుకమ్మ. అగళి మండలం నందరాజనపల్లి గ్రామం. ఈమె కుటుంబానికి జగనన్న విద్యాదీవెన కింద రూ.5,750, జగనన్న అమ్మ ఒడి కింద రూ.29 వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.3,794, వైఎస్సార్ చేయూత కింద రూ.18,750, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ.2,692 (రైతు), వైఎస్సార్ సున్నా వడ్డీ (డ్వాక్రా) కింద రూ.4,808, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.40,500 చొప్పున మొత్తం రూ.1,05,294 లబ్ధి చేకూరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వివిధ పథకాలను మంజూరు చేసి ఆదుకున్నారని రేణుకమ్మ ఆనందాన్ని వ్యక్తం చేసింది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు కురుబ అశ్వర్థమ్మ. హిందూపురం మండలం బేవినహళ్లి గ్రామంలో ఉంటోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఈమె కుటుంబానికి మూడున్నరేళ్లల్లో రూ. 3,79,706 లబ్ధి చేకూరింది. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.56,250, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.40,500, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.27,142, అలాగే పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇల్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ పంటల బీమా ద్వారా లబ్ధి పొందారు. జగనన్న ప్రభుత్వంలో తమకు అన్ని విధాలా న్యాయం అశ్వర్థమ్మ సంతోషం వ్యక్తం చేసింది. సీఎం వైఎస్ జగన్‌కు తాము రుణపడి ఉంటామని, ఇలాంటి ముఖ్యమంత్రే మాకు కావాలని తెలిపింది.





రొద్దం: మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, నందరాజనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, హిందూపురంటౌన్: పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

- ఆయనే సీఎంగా ఉండాలి
- పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి
- గడప గడపకూ మన ప్రభుత్వంలో లబ్ధిదారుల హర్షం

రొద్దం: రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఎం.కొత్తపల్లి, మోపుర్లపల్లి గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజా సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అందులో భాగంగా మంత్రుల దగ్గర నుంచి వార్డు సభ్యుల వరకూ గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వం చేసిన అభివద్ధి పనులు, ఇంకా చేయాల్సిన పనులను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకుంటున్నామని చెప్పారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సవేరా ఫార్మసిస్ట్ చరణ్‌తేజ సహకారంతో ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ రూపను అభినందించారు. అలాగే ఎం.కొత్తపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన అర్హుల జాబితాలను సచివాలయంలో గోడలపై అతికించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, ఎంపీటీసీలు కురుబ గీత, రత్నమ్మ, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, రొద్దం, కలిపి సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, కేపీ శ్రీనివాసులు, రాజగోపాల్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు షఫీవుల్లా, తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఈఓఆర్డీ కేశవరెడ్డి, ఏఓ నివేదిత, మాజీ సింగిల్ విండో చైర్మన్ మారుతిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కలిపి శ్రీనివాసులు, వజీర్, సచివాలయాల సమన్వయకర్త రవిశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకలు వీరేష్, బోయ రామాంజినేయులు, నాగరాజు, రజేశ్వర్‌రెడ్డి, నారాయణప్ప పాల్గొన్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర(అగళి): వైఎస్ జగన్ పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు.రాష్ట్రంలో అమలవుతున్న నవరత్నాలు పేదలకు వరంగా మారాయని తెలిపారు. శనివారం అగళి మండలం నందరాజనపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితే సంక్షేమ పథకాలు అలగే కొనసాగుతాయని తెలిపారు. పేదలకు పారదర్శకంగా పథకాలను అందిస్తున్నారని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు నవరత్నాలతో లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు. వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని చెప్పారు. చంద్రబాబు చెప్పే మాయ మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ మహేంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రప్ప, మండల ఇన్‌చార్జ్ శివన్న, నాయకులు తిప్పేస్వామి, నటరాజు, సురేష్, శివలింగప్పపాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్సీ ఇక్బాల్

హిందూపురం టౌన్: రాష్ట్రంలో పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలనే తేడా లేకుండా అందరూ బాగుండాలనుకునే వ్యక్తి మా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బేవినహళ్లిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ నాగభూషణం, వైస్ ఎంపీపీ రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్ ఆనంద్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. 1983 నుంచి హిందూపురానికి టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నా.. ఏ మాత్రం అభివృద్ధి చేయలేకపోయారన్నారు. ఈ 40 సంవత్సరాలు గుడ్డి గుర్రానికి పళ్లు తోముతున్నారా అని ఎద్దేవా చేశారు. పురం టీడీపీ నాయకులు, ప్రస్తుత ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ ఏనాడైనా అసెంబ్లీకి వెళ్లారా? పురం సమస్యలపై ప్రస్తావించారా? ప్రజల సమస్యలు ఎప్పుడైనా తెలుసుకునే ప్రయత్నమైనా చేశారని అని ప్రశ్నించారు. ఆయన సినీ హీరో అయ్యుండొచ్చని, కానీ హిందూపురం ప్రజలకు ఎమ్మెల్యే అని మర్చిపోతే ఎలా అన్నారు. సినిమాలే కాకుండా ఓట్లేసిన ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు. ఎంత మంది కలిసి వచ్చినా సీఎం వైఎస్ జగన్‌ను ఏమీ చేయలేరన్నారు. జగన్‌కు ప్రజల ఆశీర్వాదాలు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గోళ్లాపురం సర్పంచ్ దేవరాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లేష్, ఎంపీటీసీ ఏకాసప్ప, మండల నాయకులు బసిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఆనంద్‌రెడ్డి, రాము, మూర్తి, మండల కోఆప్షన్ మెంబర్ చాంద్‌బాషా, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రహమత్, బసప్ప, ఎంపీడీఓ నరేంద్ర, ఈఓఆర్డీ నటరాజ్ పాల్గొన్నారు.

వీరకేతమ్మ ఉత్సవాలు ప్రారంభం

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి సమీపంలో వెలిసిన వీరకేతమ్మ ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వేకువజాము నుంచి ఆలయంలో అర్చకులు కలశస్థాపన, కల్యాణోత్సవం, ధ్వజారోహణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు జ్యోతుల ఉత్సవాలను నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. ఆదివారం నాగదేవతా హోమం, చండీ యాగం, మధ్యాహ్నం బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మరథోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.


అలంకరణలో వీరకేతమ్మ అమ్మవారు


ధ్వజారోహణ నిర్వహిస్తున్న దృశ్యం

20 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం

పెనుకొండ: కర్ణాటక నుంచి పెనుకొండ ప్రాంతానికి తరలిస్తున్న 20 బాక్సుల కర్ణాటక మద్యం (1920 టెట్రా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు పెనుకొండ పరిధిలో దాడులు చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో కర్ణాటక నుంచి వచ్చిన ఓ కారులో 20 మద్యం బాక్సులు పట్టుబడ్డాయని పేర్కొన్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి, స్టేషన్‌కు తరలించామన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.లక్ష ఉంటుందన్నారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ.రెహనాబేగం, సిబ్బంది రమేష్, శివప్రసాద్, రఘునాథ్, రామనారాయణ, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, సుమ పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం బాక్సులను చూపుతున్న పోలీసులు

సంక్షిప్త సమాచారం

17 మంది జూదరుల అరెస్ట్

గుడిబండ: మండల పరిధిలోని పూజారిపల్లి, సి.సి.గిరి గ్రామాల్లో జూదం ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ ముని ప్రతాప్ శనివారం సిబ్బందితో కలిసి జూద కేంద్రాలపై దాడులు చేశారు. 17 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.17,130 నగదు, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

పాముకాటుతో రైతు మృతి


ఉప్పర రవి (ఫైల్)

రొద్దం: మండల పరిధిలోని శేషాపురం గ్రామానికి చెందిన రైతు ఉప్పర రవి (35) శనివారం పాముకాటుతో మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల మేరకు.. రైతు తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా పాము కాటుకు గురైనట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, ఐదేళ్ల కూతురు ఉన్నారు.

జోరుగా వాల్మీకి జాత్ర ప్రచారం

పావగడ: దావణగెరె జిల్లా హరిహర తాలూకా రాజనహళ్లి వాల్మీకి గురు పీఠంలో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో 5వ విశ్వకవి మహర్షి వాల్మీకి మహాజాత్ర జరగనుంది. శనివారం ముగదాళబెట్ట గ్రామంలో వాల్మీకి సంఘం నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. వాల్మీకి జాత్రా సమితి అధ్యక్షుడు నారాయణమూర్తి నేతృత్వంలో నిర్వహించిన ప్రచారంలో భాగంగా వాల్మీకి జాత్ర పోస్టర్లను విడుదల చేశారు. వాల్మీకులందరూ తప్పనిసరిగా వాల్మీకి జాత్రకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాలలో సమితి సభ్యులు భాస్కర నాయక, అంబికా రమేశ్, రంగమ్మ, సరోజమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేమన విగ్రహావిష్కరణ

హిందూపురం టౌన్: యోగి వేమన జయంత్యుత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎస్.సడ్లపల్లి సమీపంలోని వేమారెడ్డి సర్కిల్‌లో ఆదివారం యోగి వేమన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ రెడ్డి శనివారం పేర్కొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

పెనుకొండ: యోగాతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ కేటీ.రంగనాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగాపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా ద్వారా మానసిక, శారీరక సమస్యలకు ముగింపు పలకవచ్చన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప, డా.ప్రతాప్, హరీష్ బాబు, రంగనాయకులు, ఓబులేసు, శ్రీనివాసులు, సంజీవరెడ్డి, బాలరెడ్డి, కళావతి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

హిందూపురం: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవశ్యకత ఉందని ఆర్టీఓ కరుణా సాగర్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆర్టీఓ, ఎంవీఐలు, పోలీసులు, విద్యార్థులతో కలిసి శనివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకూ డ్రమ్స్ వాయిద్యాలతో వాకథాన్ నిర్వహించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ఆవశ్యకత,రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐలు రమణ, జయశ్రీ, శివశంకర్, ఏఓ జాన్‌పాల్, పట్టణ సీఐలు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలో శనివారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఆటో, ఫోర్‌వీల్ డ్రైవర్లతో కలిసి సీఐ సురేష్‌బాబు ర్యాలీ చేపట్టారు. నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలన్నారు. కార్యక్రమంలో హిందూపురం ఎంవీఐ శివశంకర్, ఎస్ఐ నాగేంద్ర పాల్గొన్నారు.

చిలమత్తూరు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 44వ నంబరు జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద రహదారి భద్రతా నియమాలను వివరించారు.

పెనుకొండ: విద్యార్థులతో జాగ్రత్తగా వెళ్లాలని లేకపోతే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. పట్టణంలో శనివారం ప్రైవేట్ పాఠశాలల బస్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు.

చట్టాలపై అవగాహన

రొద్దం: మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో టింబక్టు-కలెక్టివ్ స్వచ్ఛంధ సంస్థ సహకారంతో ఏర్పడిన అనంతశక్తి సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. దిశ చట్టం, గృహహింస, వేధింపులు, బాల్య వివాహాలపై వివరించారు. అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య మట్లాడుతూ.. మహిళలు తమకున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయ సేవా సలహాల మండలి నుంచి మహిళ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని చెప్పారు. ఎక్కడైనా మహిళలపై వేధింపులు, గృహంసలు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

'జిల్లాధికారి నడక'ను సద్వినియోగం చేసుకోండి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: పల్లెవాసులకు పైసా ఖర్చు లేకుండా అధికారులే మీ ముంగిటకు వచ్చి ప్రభుత్వ పథకాలను అందించే జిల్లాధికారి నడక-పల్లె దాక అనే ప్రజా కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెంకటరమణప్ప అన్నారు. శనివారం తాలూకాలోని గుజ్జనడు గ్రామంలో 'జిల్లాధికారి నడక-పల్లె దాక' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించినప్పుడే మంచి పేరు తెచ్చుకుంటారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రెండు సార్లు మంత్రి పదవి చేపట్టి తాలూకా వ్యాప్తంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టగలిగానన్నారు. త్వరలోనే తుంగభద్ర నీటి నుంచి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగు నీరందిస్తామన్నారు. వేరుశనగకు పట్టిన నల్ల చీడ తెగులు నివారించడంలో స్థానిక వ్యవసాయశాఖ అధికారులు విఫలమయ్యారని వ్యవసాయ శాఖ అధికారి అశోక్‌పై మండిపడ్డారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరదరాజు, ఈఓ శివరాజయ్య, బీఈఓ అశ్వర్థనారాయణ, ఆరోగ్యాధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న ఆటో: ఆరుగురికి గాయాలు



హిందూపురం: పట్టణ సమీపంలోని కొట్నూరు క్రాస్ వద్ద శనివారం బస్సును ఆటో ఢీకొన్న ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. హిందూపురం వైపునకు వెళ్తున్న మరో ఆటోను ఓవర్ టేక్ చేయడానికి ఆటో డ్రైవర్ సద్గురుడు వేగంగా వెళ్తూ ముందు వెళ్తున్న ఆర్టీసీని వెనుక వైపు నుంచి ఢీ కొట్టినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఆటోలో ప్రయాణిస్తున్న బాషా, జ్యోతి, అనిత, రబియా, చిన్నారులు సుజన్‌రెడ్డి, ఫకృద్దీన్ గాయపడ్డారు. వీరిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

పరామర్శ..

రోడ్డు ప్రమాదంలో గాయపడి.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే గాయపడిన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందించారు.

వక్తృత్వ పోటీల్లో ఉత్తమ ప్రతిభ


స్వప్న

చిలమత్తూరు: కొత్తచెరువు జెడ్పీహెచ్ఎస్‌లో వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేద చట్టం'పై శనివారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పొట్టిశ్రీరాములు జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న స్వప్న ఉత్తమ ప్రతిభ కనబరిచి, జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్లు హెచ్ఎం జయప్రద తెలిపారు. విద్యార్థినికి రూ.10 వేలు నగదు అందజేశారన్నారు.

జోరుగా కాంగ్రెస్‌లో చేరిక

పావగడ: తాలూకాలోని తిరుమణి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆర్ అచ్చమ్మనహళ్లి గ్రామంలో సుమారు 30 మంది జేడీఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి హెచ్.వి వెంకటేశ్ వారికి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వెంకటరమణప్ప చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఎలాంటి అభివృద్ధి పనులు చేయని జేడీఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరామన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి హెచ్.వి వెంకటేశ్‌ను వచ్చే స్థానిక విధానసభ ఎన్నికల్లో తప్పకుండా గెలిపిస్తామన్నారు.

రేపు ఆర్డీటీ గృహ ప్రవేశాలు

రొళ్ల: మండల పరిధిలోని వన్నారనపల్లి గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన 34 గృహాల ప్రారంభోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఏటీఎల్ సుబ్బయ్య శనివారం తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి అన్ని మౌలిక సదుపాయాలతో కలిపి ఆర్డీటీ రూ.2.60 లక్షలు ఖర్చు చేస్తోందన్నారు. గృహ ప్రవేశాలకు 35 మంది స్పెయిన్ దేశస్తులు వారి బృందంతో హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

ఫిబ్రవరి 11న మెగా లోక్ అదాలత్


మాట్లాడుతున్న ఏడీజే శైలజ

హిందూపురం: ఫిబ్రవరి 11వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఏడీజే శైలజ కోరారు. శనివారం స్థానిక ఏడీజే కోర్టు ఆవరణలో వేర్వేరుగా సన్నాహక మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. కేసులను సత్వరమే పరిష్కరించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి మెగా లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు శ్రీధర్, స్పందన, రాజ్యలక్ష్మి, ఏపీపీలు ఇందాద్, నగేష్, ఏజీపీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

హిందూపురం: క్షణికావేశంలో తప్పులు చేసి జైలుకు వచ్చి శిక్షలు అనుభవించవద్దని హిందూపురం జూనియర్ సివిల్ జడ్జి స్పందన అన్నారు. శనివారం స్థానిక సబ్ జైలును తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీల వివరాలు, ఏయే కేసుల్లో నిందితులుగా ఉన్నారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైలు గదులు, వైద్య సదుపాయం వివరాలపై ఆరా తీశారు. ఆహారం, వైద్య సదుపాయాలపై నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిద్ధూ, పార్వతి, లోక్ అదాలత్ సభ్యులు శారద పాల్గొన్నారు.